

చిలుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాబు

## గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా చూడాలి

- ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు, మే15, గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ గిరిబాబు సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందేలా చూడాలన్నారు. గ్రామ నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, ఏపీఓ నిర్మల, గ్రామ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

**మొక్కలను సంరంక్షించాలి : ఎంపీడీఓ సునీత**

నూతనకల్ : వేసవి నేపథ్యంలో మండలంలోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాల్లో నాటిన మొక్కలను సంరంక్షించాలని ఎంపీడీఓ సునీత అన్నారు. మండల పరిధిలోని మిర్యాల, లింగంపల్లి, అల్లునూరు గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, వన నర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా రెండు రోజులకు ఒకసారైనా నీళ్లు పట్టాలన్నారు. వన నర్సరీలో నాటిన ప్రతి మొక్కను సంరంక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ట్యాంకర్ డ్రైవర్లను ఒక రోజు చెత్త సేకరణకు, మరోరోజు ట్యాంకర్‌కు పంపించాలని సూచించారు. వీధులను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు ఆప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఏపీఓ శ్రీరాములు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## తాటి ముంజలకు భలే గిరాకీ

పాలకవీడు, మే 15 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తాటి ముంజలకు గిరాకి పెరిగింది. పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు వేసవి తాపం తీర్చేలా ప్రకృతి సిద్ధంగా లభిస్తున్న తాటి ముంజల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాలకు చెందిన పలువురు మహిళలు ముంజల గంపలతో రోజూ ఉదయమే మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. మండల కేంద్రంలోని చౌరస్తాతో పాటు పలు వీధుల్లో డజను రూ.40 నుంచి 50 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా అమ్ముతున్నారు. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో తాటి ముంజల విక్రయంతో రోజూ రూ.500 నుంచి 600 వరకు ఆదాయాన్ని పొందుతున్నట్లు మహిళలు వెల్లడిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



పాలకవీడులో తాటి ముంజలను విక్రయిస్తున్న మహిళలు



ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

## గుండెపోటుతో వాచ్‌మన్ మృతి

- ఆస్పత్రి నిర్లక్ష్యమేనని కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన బంధువులు

బొడ్రాయిబజార్, మే 15 : చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి గ్రామానికి చెందిన నకిరేకంటి పుల్లయ్య (60) జిల్లా కేంద్రంలోని ఆర్వి ఆస్పత్రిలో నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటల వరకు విధులు నిర్వహించిన పుల్లయ్య ఒక్కసారిగా కుప్పకూలాడు. దాంతో ఆస్పత్రి సిబ్బంది వెంటనే అత్యవసర వైద్యం అందించినప్పటికి ఫలితం లేకపోవడంతో పుల్లయ్య మృతి చెందాడు. గుండెపోటే మృతికి కారణమని వైద్యులు నిర్ధారించారు. అయితే మృతి సమాచారం తెలిసిన పుల్లయ్య కుటుంబ సభ్యులు, బంధువులు డాక్టర్లు, ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే మృతికి కారణమంటూ ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. పుల్లయ్య మృతికి కారణం విద్యుత్ షాక్‌కే కారణమని పేర్కొంటూ మృతదేహంతో సుమారు 4 గంటల పాటు ఆందోళన నిర్వహించారు. ఆస్పత్రి సీసీ పుటేజీ చూపించినప్పటికీ వినిపించుకోకుండా బంధువులు న్యాయం చేయాలని ఆందోళనను కొనసాగించారు. దాంతో పట్టణ సీఐ రాజశేఖర్ కలుగజేసుకుని వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

## విద్యుదాఘాతంతో బర్రెలు మృతి

చిలుకూరు, మే 15 : విద్యుదాఘాతంతో పాడి బర్రెలు రెండు మృతిచెందాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మునగాల సైదిరెడ్డికి చెందిన బర్రెలు రోజువారిగా మేతకు పొలాలకు వెళ్లాయి. పొలాల్లో విద్యుత్ తీగలు తెగి కిందపడటంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

## అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, మే 15 : రాష్ట్రంలో సారత్రిక ఎన్నికల సమరం ముగిసినందున అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయడు అన్నారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే అధికారులు అందుబాటులో లేక ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం,

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కొమ్మరాజు వెంకట్, సైదులు పాల్గొన్నారు.

## రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం కొనసాగుతుండడంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో పక్క పగలు సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో ఉక్కపోత సమస్య తగ్గలేదు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36.8డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.4డిగ్రీలు, గాలిలో తేమ 39శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

### ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం పట్టించుకోదనే స్పష్టమైన సంకేతం

### ఎల్ అండ్ టీకి సాధ్యంకానిది ఇతర సంస్థలకు సాధ్యమా?

### ఈ ప్రభావం విస్తరణ ప్రాజెక్టులపైనా ఉంటుందంటున్న నిపుణులు

ప్రపంచంలోనే అతి పెద్ద పబ్లిక్-ప్రైవేటు-పార్ట్‌నర్‌షిప్ మెట్రో ప్రాజెక్టు.. నిన్నటిదాకా ఇలా మన గర్వంగా చెప్పుకున్న హైదరాబాద్ మెట్రో మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. హైదరాబాద్ మహా నగరానికి విశ్వ నగర ఖ్యాతిని తీసుకురావడంలో తన వంతు పాత్ర పోషించిన ఈ బృహత్తర ప్రాజెక్టు ఇప్పుడు 'మహాలక్ష్మి' పథకంతో విలవిలలాడుతున్నది. ఇక.. మెట్రోను తాము నిర్వహించలేమంటూ ప్రతిష్ఠాత్మకమైన ఎల్ అండ్ టీ సంస్థ చేతులెత్తేస్తున్న నేపథ్యంలో అందరూ రాష్ట్ర ప్రభుత్వం వంక ఆశగా ఎదురు చూశారు. పరిస్థితిని చక్కదిద్దడంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రియాశీలక పాత్ర పోషిస్తుందని భావించారు. కానీ 'అమ్ముకుంటే అమ్ముకోనీ' అంటూ.. సీఎం రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టడంతో హైదరాబాద్ మెట్రో పయనమెటు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కొనేవారుంటే పర్వాలేదు! కానీ ఎల్ అండ్ టీతోనే సాధ్యం కానిది మాకెలా?! అని ఎవరూ ముందుకురాకపోతే ఎల్ అండ్ టీ వేసే తదుపరి అడుగు ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతుంది. ఇదే క్రమంలో నగరం నలువైపులా విస్తరిస్తుందనుకుంటున్న మెట్రో రైలు ప్రాజెక్టుపై ఈ పరిణామం ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందనేది కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 15 (నమస్తే తెలంగాణ):



# మెట్రో పయనమెటు?!

## సీఎం రేవంత్ వ్యాఖ్యలతో మరింత గందరగోళం

**ఆధునిక ప్రజా రవాణాకు చిరునామాగా** మారిన మెట్రో రైలు ప్రాజెక్టుపై హైదరాబాద్ వేదికగా పడిన తొలి అడుగు అంతర్మథనంలో పడిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారడం సగటు నగరవాసిని కలిచివేస్తున్నది. అయితే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి పథకం'తో పురోగమన దిశగా ఉన్న ప్రయాణికుల సంఖ్య తిరోగమనంలో పడిపోయిందని, ఈ క్రమంలో తాము మెట్రో రైలును అమ్ముకుంటామంటూ ఎల్‌అండ్‌టీ సంస్థ చేసిన ప్రకటన సంచలనం రేకెత్తించింది. వాస్తవానికి దేశంలోని ఇతర నగరాల్లో ఉన్న మెట్రో ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. కానీ హైదరాబాద్ మెట్రో రైలు మాత్రం అందుకు భిన్నం. ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాతిపదికన ఏర్పాటైన ప్రాజెక్టు కావడంతో ఇందులో 90 శాతం ఎల్‌అండ్‌టీ సంస్థ భాగస్వామ్యం ఉండగా.. మిగిలిన పది శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానిది. ప్రాజెక్టు రూపకల్పన దశలో వయబుల్ గ్యాప్ ఫండింగ్ (వీజీపీ) కింద రూ.వెయ్యి కోట్లకు పైగా కేంద్రం నుంచి నిధులు వచ్చేలా అంగీకారం ఉన్నప్పటికీ మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.254 కోట్ల బకాయిలను పదేండ్లుగా విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వానికి ఆసక్తి లేదనేది సుస్పష్టం. ఇక మిగిలిందల్లా.. రాష్ట్ర ప్రభుత్వం! కానీ దీనిపైనా రెండు రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేశారు. ఎల్‌అండ్‌టీ మెట్రోను అమ్ముకుంటే అమ్ముకోనీ.. మనమేం చేస్తం! అని చేతులెత్తేసినట్లుగా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దీంతో మెట్రో నిర్వహణ అనేది ఎల్‌అండ్‌టీ చేయాలి.. లేకపోతే ఇతర సంస్థలకు అమ్ముకోవాలి. అయితే ఎల్‌అండ్‌టీ లాంటి దిగ్గజ సంస్థనే చేతులెత్తేసి, మెట్రోను అమ్ముతుంటే ధైర్యంగా ముందుకొచ్చి తీసుకునే ప్రైవేటు సంస్థ ఉంటుందా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల సంఖ్య తగ్గినందున విక్రయిస్తున్నామంటూ ఆ సంస్థ ప్రకటించిన తర్వాత ఇతర సంస్థలు నష్టాల్లో కూరుకుపోయే దానిని తీసుకునేందుకు ఎలా ముందుకొస్తాయని చెబుతున్నారు. మరి.. ఇదే జరిగితే ఎల్‌అండ్‌టీ నష్టాలను భరిస్తూ మెట్రోను ముందుకు తీసుకుపోవడం సందేహంగానే ఉందని, ఈ సాకుతో ఆ సంస్థ పూర్తిగా చేతులెత్తేస్తే?! అనేది ఇప్పుడు అందరిలోనూ వ్యక్తమవుతున్న ఆందోళన.

### విస్తరణ ప్రాజెక్టు భవితవ్యమేంది?

ప్రస్తుతం నగరంలో మూడు కారిడార్లలో 66 కిలోమీటర్ల మేర మెట్రో ఉంది. దీనిని మరో 70 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు రేవంత్ ప్రభుత్వం ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. పార్లమెంటు ఎన్నికల కోడ్‌కు ముందుగానే అట్టహాసంగా శంకుస్థాపన కూడా చేసింది. అయితే ఈ విస్తరణ ప్రాజెక్టులు అన్నింటికీ మూలాధారం.. ప్రస్తుతం ఉన్న మెట్రోనే. పాత అలైన్‌మెంట్‌కు అనుసంధానంగానే విస్తరణ ప్రాజెక్టుల అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఈ క్రమంలో మూలాధారమైన అలైన్‌మెంట్ నిర్వహణనే గందరగోళంగా మారితే అనుసంధాన-విస్తరణ అలైన్‌మెంట్ల నిర్వహణ అనేది ప్రహసనంగా మారుతుంది. ఒకవేళ విస్తరణ ప్రాజెక్టుల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటే.. వాటికి అనుసంధానం చేసేందుకు ఎల్‌అండ్‌టీ తన నష్టాలను ముందుపెట్టే అవకాశముంది. అలాకాదని ప్రభుత్వం ఎల్‌అండ్‌టీకి అప్పగించాలనుకుంటే ఉన్న దానికే దిక్కులేదనే సాకు చూపుతుంది. ఇవన్నీ కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నిర్వహించే ఆర్థిక స్థితిగానీ, అనుకూల పరిస్థితులుగానీ లేవనేది సీఎం రేవంత్ ప్రకటన ద్వారానే స్పష్టమవుతుంది. ఇలా హైదరాబాద్ మెట్రో రైలు చుట్టూ అనేక రకాల సందేహాలు, అనుమానాలు కమ్ముకోవడంతో మనుగడ ఎలా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది.

## నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కోదాడ టౌన్, మే 15 : నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు వచ్చే టీఏ, డీఏ చెల్లించాలన్నందుకు పోలీసులతో లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఎన్.నాగేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీఓ ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని ప్రశ్నిస్తే పోలీసుల చేత కొట్టించడం అప్రజాస్వామికం అన్నారు. లాఠీచార్జిని ఖండిస్తూ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

నేరేడుచర్ల : ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వై.కృష్ణయ్య, అక్కయ్యబాబు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 691 ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు లాఠీచార్జ్ చేయించడాన్ని యూటీఎఫ్ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీఓ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు నిబంధనల మేరకు రెమ్యూనరేషన్ చెల్లించాలని పేర్కొన్నారు.

### ప్రభుత్వం టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

కాచిగూడ, మే 15: పీఆర్‌సీ రిపోర్టులో తెలిపిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో రిటైర్డ్‌మెంట్‌తో ఖాళీ ఏర్పడ్డ 25వేల టీచర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం టీచర్ పోస్టుల సంఖ్యను పెంచితే బీఈడీ, డీఈడీ విద్యనభ్యసించిన వందలాది మందికి అర్హత లభిస్తుందన్నారు. గత 25 ఏండ్లుగా ఎయిడెడ్ పాఠశాలల్లో 90 శాతం ఖాళీగా ఉన్న టీచర్, పీఈటీ, ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

# సిటీలో పనులన్నీ బంద్

## జీహెచ్‌ఎంసీలో పేరుకుపోయిన బిల్లులు

**రూ.1350కోట్ల బకాయిలు చెల్లించండి**

**బిల్లులు చెల్లించే వరకు పనులు చేయబోమని కాంట్రాక్టర్ల అల్టిమేటం**

**18 నుంచి బంద్‌కు పిలుపునిచ్చిన కాంట్రాక్టర్లు**

**ప్రజలకు మరిన్ని అవస్థలు తప్పవనే సంకేతాలు**



గచ్చిబౌలిలోని శిల్పాలేఅవుట్ వద్ద ఆరు నెలలుగా నిలిచిపోయిన నిర్మాణ పనులు

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీతో కాంట్రాక్టర్లు పోరుకు సిద్ధమయ్యారు. బకాయిలు చెల్లిస్తేనే పనులు జరుపుతామని, కొత్తగా వచ్చే ఏ పనులను చేపట్టబోమని, ఈ నెల 18 నుంచి కాంట్రాక్టర్లు మూకుమ్మడిగా బంద్‌లోకి వెళ్తున్నట్లు అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.1,350 కోట్ల బిల్లులు రావాల్సి ఉన్నదని, వాటిని వెంటనే రిలీజ్ చేయాలని జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బకాయిలు పేరుకుపోవడంతో కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారని వాపోయారు. కొత్తగా ఎలాంటి పనులు చేపట్టబోమని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో రాబోయే రోజుల్లో జీహెచ్‌ఎంసీలో పనులు నిలిచిపోయి ప్రజలకు మరిన్ని అవస్థలు తప్పవనే సంకేతాలు కనబడుతున్నారు.

### పోరుబాటలో కాంట్రాక్టర్లు

జీహెచ్‌ఎంసీతో తాడోపేడో తేల్చుకోవాలని కాంట్రాక్టర్లు పోరు బాటకు నిర్ణయం తీసుకున్నారు. గత జనవరి నెల నుంచి రోజుకో రీతిలో నిరసనలు తెలుపుతూ వస్తున్నారు. జోనల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, వినతిపత్రాలు సమర్పించి.. ఏకంగా ఇందిరాపార్కు వద్ద రోజంతా ధర్నా చేపట్టి నిరసన చేపట్టారు. ఈ లోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పురోగతిలో ఉన్న పనులు చేపడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగియడంతో బంద్‌కు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ గల్లా పెట్టే ఖాళీగా మారడం, ఉద్యోగుల జీతాలు, ఇతర నిర్వహణ పనులకే చెల్లిస్తున్నారు. నాలా పూడికతీత పనులు, వర్షాకాల ముందస్తు పనులు, ఎస్ఎన్‌డీపీ పనులను కాంట్రాక్టర్లు చేపడుతున్నారు.

### వరద ముంపు తప్పదా..?

ప్రతి ఏటా వర్షాకాలంలో ముందస్తుగా వరద ముంపు నివారణ చర్యలు చేపడుతారు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలో పూడిక తీత పనులు చేపడుతారు. ఇందులో భాగంగా ఈ ఏడాది రూ.45 కోట్లతో రూ.884.15 కిలోమీటర్ల మేర సుమారు ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను తీసేందుకు కాంట్రాక్టర్లతో పనులు జరుపుతున్నారు. ఈ నెల 31వ తేదీ నాటికల్లా పూడిక తీత పనులు పూర్తి కావాలి. కానీ ఇప్పటి వరకు 60శాతం కూడా పనులు పూర్తి కాలేదు. ఈ క్రమంలోనే కాంట్రాక్టర్లు పనులు మానేసి బంద్‌లోకి వెళ్తుండడంతో ప్రజలకు వరద ముంపు సమస్యలు తప్పేలా లేవు. మరోపక్క వర్షాలకు అత్యవసర బృందాల ఏర్పాట్లు, ఐఆర్‌టీ టీంలకు ప్రత్యేక సహాయక చర్యల పనులను అప్పజెప్పుతారు. ఈ పనులను సైతం మేం చేయబోమని కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేయడం మరింత భయాందోళనకు గురి చేస్తున్నది.

### కొత్త టెండర్లకు స్పందన కరువు

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం కొత్తగా ఏ పనులు మొదలు పెట్టాలన్న కాంట్రాక్టర్లే కాదు అధికారులు జంకుతున్న పరిస్థితి. సంస్థ ఆర్థిక పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతుండడం, మరోపక్క అప్పుల కుప్ప పేరుకుపోతుండడంతో చేసిన పనులకు జీహెచ్‌ఎంసీలో బిల్లులు రావని జోరుగా ప్రచారం నడుస్తున్న తరుణంలో జీహెచ్‌ఎంసీ పిలిచిన టెండర్లకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీంతో పనులకు మళ్లీ మళ్లీ టెండర్లు పిలవాల్సి వస్తుందని స్వయంగా అధికారులే చెబుతున్న పరిస్థితి. కాంట్రాక్టర్ల బంద్‌ను ఏ మేర అధికారులు నిలువరిస్తారో అన్నది వేచి చూడాల్సిందే.

## లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

మఠంపల్లి, మే 15 : మండల కేంద్రంలోని బ్రహ్మంగారి దేవాలయంలో నెలకొన్న రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి వారి గ్రామోత్సవంను నారసింహ మాలదారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు తిరుమంజన అభిషేకం జరిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంపై నారసింహ నామ సంకీర్తనతో గ్రామోత్సవం నిర్వహించారు.

## రాయితీపై జీలుగ విత్తనాలు

సూర్యాపేట, మే 15 : జిల్లాలోని రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 23 మండలాల్లో విత్తనాలు సరఫరా చేయడం కోసం 39 పీఏసీఎస్, ఆర్ఎస్‌కే సెల్ కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1,150 క్వింటాళ్ల జిలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. పచ్చి రొట్ట ఎరువులు (జీలుగ) వేయదలిచిన రైతులు సంబంధిత మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు.

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, మే 15 : కామిరెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిందన్నారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కుమ్మరి సత్రం నూతన కమిటీ

మఠంపల్లి, మే 15 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో గల శాలివాహన (కుమ్మరి) సత్రం నూతన కమిటీ ఎన్నికను బుధవారం నిర్వహించారు. సత్రం నూతన అధ్యక్షుడిగా గొట్టం సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా మామిడి రామారావు, కోశాధికారిగా మలికంటి మట్టపల్లిరావు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, గొల్లపల్లి కోటయ్య, సహాయ కార్యదర్శులుగా కొలిపాక కృష్ణ, సలికంటి రాజారావు, చీర్లదిన్నె ఉమామహేశ్వర్‌రావు ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగాపు మాల్యాద్రి, మలికంటి బుచ్చయ్య, సైదులు, సుబ్బారావు, కాశయ్య పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్

గరిడేపల్లి, మే 15 : భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, కావున ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో భవన నిర్మాణాలు చేపట్టకపోవడంతో కార్మికులకు పనులు దొరకక వారి కుటుంబాలు గడవడమే కష్టతరంగా మారిందన్నారు. కావున ప్రభుత్వం వారికి పని వసతి కల్పించాలన్నారు. సమావేశంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## నియమావళికి అనుగుణంగా పని చేయాలి

- సెర్ప్ ఏపీఎం కరుణాకర్

నూతనకల్, మే 15 : స్వయం సహాయక సంఘాలు ఆర్థిక నియమావళికి అనుగుణంగా పని చేయాలని సెర్ప్ ఏపీఎం కరుణాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళ సంఘాలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామా సంఘాల సమావేశాల్లో లావాదేవీల పారదర్శకతపై చర్చించి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరుచాలని సూచించారు. అలాగే ప్రతి నెల సంఘాలు చేయాల్సిన పనులపై చర్చించి తీర్మాణాలు చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళఋూ సంఘాలు సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించి లబ్ధిపొందాలని పేర్కొన్నారు.

## 'ఉపాధి హామీ కూలీల వేతనాలు విడుదల చేయాలి'

మోతె, మే 15 : పాన్‌కార్డు లేదని ఉపాధి హామీ కూలీలకు పోస్టల్ అధికారులు వేతనాలు విడుదల చేయకపోవడం దారుణమైన విషయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మండల పరిధిలోని రాఘవపురం, నామవరం గ్రామ ఉపాధి కూలీలకు సుమారు రూ.20 లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరై నెలలు గడుస్తున్నా వేతనాలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. తక్షణమే ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.